సాక్షి
ఏలూరు
గురువారం । 19 । సెప్టెంబర్ । 2024



అఘాయిత్యాలపై కఠిన చర్యలు
చిన్నారులు, బాలికలు, మహిళలపై లైంగిక దాడులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని డీజీపీ ద్వారకాతిరుమల రావు హెచ్చరించారు. 8లో ▸



హుండీ ఆదాయం రూ.2.05 కోట్లు
ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల ఆదాయాన్ని లెక్కించారు. 28 రోజులకు రూ.2,05,16,675 నగదు లభించిందని ఈఓ తెలిపారు. 8లో ▸



ఆశ్రమం మాటున మానవ మృగాలు
ఏలూరులో సరస్వతి సేవాశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న బాలికల వసతి గృహంలో అఘాయిత్యాల కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. 8లో ▸

● విశ్వసనీయంగా సేవలందిస్తాం
ఈ ఎన్నికల్లో తమకు విజయం చేకూరిస్తే అయిదేళ్లపాటు ప్రజలకు విశ్వసనీయ సేవలు అందిస్తాం. ఎన్డీయే కూటమి మేనిఫెస్టోలోని అంశాల అమలుకు కృషిచేస్తాం. మహిళలకు ఆడబిడ్డ నిధి, తల్లికి వందనం, నిరుద్యోగ భృతి, మహిళలకు ఉచిత ప్రయాణం, మూడు ఉచిత గ్యాస్ సిలిండర్లు వంటివి ప్రాధాన్యంగా అమలుచేస్తాం.



దెందులూరు ఎన్నికల ప్రచార సభలో టీడీపీ అధినేత చంద్రబాబు ప్రసంగం

● అన్నివర్గాలకూ సంక్షేమం
జనసేన షణ్ముఖ వ్యూహం, తెదేపా సూపర్ సిక్స్ కలిపి 12 అంశాలు కీలకంగా ఉమ్మడి మేనిఫెస్టో రూపొందించాం. విద్యార్థులు, యువత, నిరుద్యోగులు, మహిళలు, వృద్ధులు, ఇలా అన్ని వర్గాల సంక్షేమానికి, అభివృద్ధికి చోటు కల్పించాం. ప్రతి కుటుంబానికి రూ.25 లక్షల ఆరోగ్య బీమాతో ప్రజలందరికీ వైద్యాన్ని అందుబాటులోకి తెస్తాం.



కొయ్యలగూడెంలో నిర్వహించిన వారాహి విజయభేరి సభలో పవన్‌కల్యాణ్ ప్రసంగం

● నిరుద్యోగ భృతి రూ.3 వేలు
వలసలు అరికట్టడానికి, ఎక్కువ మంది యువతకు ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటాం. ఏటా జాబ్ క్యాలెండర్ విడుదల చేస్తాం. ఏటా 4 లక్షల చొప్పున ఐదేళ్లలో 20 లక్షలు ఉద్యోగాలు ఇస్తాం. నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి అందజేస్తాం. మహిళా సాధికారతకు ప్రతినెలా రూ.1,500 అందిస్తాం.



ఎన్నికల సమావేశాల్లో ప్రస్తుత దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాటలు.

● రైతుకు ఏటా రూ.20 వేలు
కర్షకులకు ఏటా రూ.20 వేల ఆర్థిక సాయం అందిస్తాం. యువతకు ఉద్యోగాలు ఇచ్చేవరకు ప్రతి నిరుద్యోగికి రూ.3 వేల చొప్పున భృతి ఇస్తాం. 18 ఏళ్లు దాటిన మహిళలందరికీ నెలకు రూ.15 వేల చొప్పున అందిస్తాం. తల్లికి వందనం పేరిట ఇంట్లో ఎంత మంది విద్యార్థులుంటే అంతమందికి ఏటా ఒక్కొక్కరికీ రూ.15 వేలిస్తాం.



ఎన్నికల సమావేశాల్లో ప్రస్తుత ఏలూరు ఎమ్మెల్యే బడేటి రాధాకృష్ణయ్య (చంటి) మాటలు.



అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ..
కూటమి అధికారంలోకి రాగానే ప్రతి ఇంటికీ మూడు గ్యాస్ బండలు ఉచితంగా ఇస్తాం. వీటి ద్వారా మహిళలకు రూ.2,500కు పైగా లబ్ధి చేకూరుస్తాం.
- ఏలూరు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే బడేటి చంటి

1



ప్రతి రైతుకూ రూ.20 వేలు
కూటమి అధికారంలోకి వస్తే ప్రతి రైతుకూ రూ.20 వేల చొప్పున ఖరీఫ్ నాట్లు వేయడానికి ముందే మీ చేతుల్లో పెడతాం. కచ్చితంగా చేసి తీరతాం.
- దెందులూరు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

2



ఎంతమంది పిల్లలున్నా..
ఇంట్లో ఎంత మంది పిల్లలుంటే అందరికీ తల్లికి వందనం అందిస్తాం. ఒక్కరికీ రూ.15 వేల చొప్పున ఇద్దరికీ రూ.30 వేలు, ముగ్గురికీ రూ.45 వేలు ఇస్తాం.
- నూజివీడు ఎన్నికల సభలో మంత్రి కొలుసు పార్థసారథి

3



మహిళలకు పాకెట్ మనీగా..
మహిళలకు నెలకు రూ.1,500 చొప్పన చేతి ఖర్చులకు డబ్బులు ఇస్తాం. ఇది జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ మాట. ఆంక్షలు లేకుండా అందిస్తాం.
- ఉంగుటూరు ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు

4



నెలకు రూ.3 వేల భృతి
గిరిజన ప్రాంతంతో సహా ఎక్కడైనా నిరుద్యోగులకు నెలకు రూ.3 వేల చొప్పన భృతి ఇస్తాం. అధికారంలోకి వచ్చిన మొదటి నెల నుంచే అమలు చేస్తాం.
- పోలవరం ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే చిర్రి బాలరాజు

5



అందరికీ మేలు చేస్తాం
మహిళలకు బస్సు ఫ్రీ.. కూటమి అధికారంలోకి రాగానే ఈ హామీని అమలు చేస్తాం. దీంతో మహిళలకు రవాణా ఖర్చులు మిగులుతాయి. అందరికీ మేలు జరుగుతుంది.
- ఏలూరు ఎన్నికల ప్రచారంలో ఎంపీ పుట్టా మహేష్

6

6 సూపర్ ఫ్లాప్




- బాబు ష్యూరిటీ.. ఒక్క దానికీ లేదు గ్యారెంటీ
- వంద రోజులు గడుస్తున్నా స్పష్టత కరువు
- ఒక్క పథకాన్నీ అమలు చేయని వైనం
- ఆరునూరైనా అమలు చేయాలంటున్న ప్రజలు



అబద్ధపు హామీలతో అందలమెక్కి.. అధికారం చేపట్టిన తర్వాత పట్టించుకోక పోవడం.. విశ్వసనీయత లేని నాయకుడనే ఆక్షేపణ.. అధికారమే పరమావధిగా ప్రజలను మభ్యపెట్టడం చంద్రబాబు నైజం.. 'మారిన మనిషంటూ' జనాల్ని నమ్మించి.. సూపర్ సిక్స్ పథకాలంటూ ఊదరగొట్టి.. సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన చంద్రబాబు.. ఇప్పుడు సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయాలంటే భయమేస్తోందని అనడం ఆయన అవకాశవాద రాజకీయాలకు నిదర్శనం. అధికారంలోకి వచ్చీ రాగానే ఏటా రైతు సాయం పేరుతో రూ.20 వేలు, ఇంట్లో ఎంత మంది పిల్లలున్నా ఒక్కొక్కరికీ రూ.15 వేల చొప్పున తల్లికి వందనం, 19 ఏళ్ల నుంచి 59 ఏళ్ల మహిళలకు నెలకు రూ.1,500 సాయం, మహిళలకు రాష్ట్రంలో ఎక్కడ తిరిగినా ఉచిత బస్సు ప్రయాణం ఇలా సూపర్ సిక్స్ పథకాలంటూ ఊరూవాడా గట్టిగా ప్రచారం చేశారు. గద్దెనెక్కి 100 రోజులు గడుస్తున్నా వీటి ఊసెత్తకపోవడం గమనార్హం. ఎన్నికల ప్రచారంలో మారిన మనిషినంటూ ప్రతి చోటా చెప్పుకున్న ఆయన ముసుగు తొలగించుకుని నేనేమీ మారలేదంటూ.. తన కుట్ర పూరిత నైజాన్ని మరోసారి బయటపెట్టారు.

సాక్షి ప్రతినిధి, ఏలూరు: సూపర్ సిక్స్.. సూపర్ హిట్ కాంబినేషన్.. మీ భవిష్యత్తుకు బాబు గ్యారెంటీ... అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలు అమలు చేస్తాం.. చీకట్లో మగ్గిపోతున్న ప్రతి ఇంట్లో వెలుగురేఖలు నింపుతాం.. ఇది ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ మొదలు కూటమి పార్టీలు ఇంటింటికీ తిరిగి చేసిన ప్రచారం. తీరా అధికారం చేపట్టి 100 రోజులు గడుస్తున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు పట్టించుకోవడం ఏదు. అసెంబ్లీ సాక్షిగా సూపర్‌సిక్స్ పథకాలు అమలు కష్టమేనంటూ చేసిన ప్రకటన జిల్లాలో తీవ్ర చర్చగా మారింది. చంద్రబాబు ప్రకటించిన పథకాల ద్వారా ఏలూరు జిల్లాలో ఇప్పటివరకు రూ.1,800 కోట్లకుపైనే ప్రజలు నష్టపోయారు. అదే ఏడాదికి లెక్కిస్తే రూ.4,200 కోట్లు వస్తుంది. విద్యా సంవత్సరం ప్రారంభమై 95 రోజులు దాటినా తల్లికి వందనం మాటెత్తడం లేదు. ఖరీఫ్ సాగు మొదలైనా పెట్టుబడి సాయం ఊసేలేదు.. కనీసం ఫలానా తేదీ నుంచి అమలుచేస్తామన్న ప్రకటన కూడా లేకపోవడంతో కూటమి నేతల తీరుపై జిల్లాలో సర్వత్రా ప్రజలు మండిపడుతున్నారు. అదే జగన్ సర్కారు ఉంటే మేనిఫెస్టోలో చెప్పిన ప్రతిదీ క్యాలెండర్ ప్రకటించి మరీ అమలు చేశారని గుర్తుచేసుకుంటున్నారు. ఈ రెండు నెలల్లోనే అమ్మఒడి, రైతుభరోసా రెండు పథకాల ద్వారా రూ.500 కోట్లకు పైగా నేరుగా జిల్లాలోని లబ్ధిదారుల ఖాతాలకు జమచేసేవారని అంటున్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ఇచ్చిన హామీలను నిలుపుకున్నారని చెబుతున్నారు.

నిరుద్యోగ భృతి



జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో గృహాలు **4,50,118**
పట్టణ ప్రాంతాల్లో నివాసాలు **97,672**
ఇంటికో ఉద్యోగం లేదా నిరుద్యోగ భృతి కింద అందించాల్సిన మొత్తం నెలకు రూ.**164** కోట్లు

100 రోజులు గడుస్తున్నా భృతి లేదు



ఎన్నికల సందర్భంగా టీడీపీ కూటమి సూపర్ సిక్స్ హామీలతో నిరుద్యోగ భృతి ఇస్తామన్నారు. నేను ఎంఏ బీఈడీ చేశాను. కూటమి అధికారంలోకి వచ్చి 100 రోజులు గడుస్తున్నా పట్టించుకోవడం లేదు. ఉద్యోగాల కల్పన ఊసే ఎత్తడం లేదు.
- కట్టా ఏసుబాబు, దెందులూరు

తల్లికి వందనం..



జిల్లాలో పాఠశాల విద్యార్థులు **2,91,858**
కళాశాల విద్యార్థులు **31,445**
ఏడాదికి రూ.15 వేల చొప్పున అందించాల్సిన సాయం రూ.**486.96** కోట్లు

తల్లికి వందనం ఏదీ



నా ఇద్దరు పిల్లలు ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్నారు. ఎన్నికల సమయంలో కూటమి పార్టీలు ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుతుంటే అందరికీ రూ.15 వేల చొప్పన ఇస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికీ ఈ డబ్బులు రాలేదు. చదువులకు ఇబ్బందిగా ఉంది.
- రమ్య, నర్సింగపాలెం, ఆగిరిపల్లి మండలం


చదువులకు ఏదీ ఆసరా



కూటమి ప్రభుత్వం తల్లికి వందనం పేరుతో చదువుకుంటున్న విద్యార్థులకు ఇస్తానన్న సాయానికి నిధులు వెంటనే విడుదల చేయాలి. ఎంతమంది పిల్లలున్నా తల్లికి వందనం ఇస్తామని హామీ ఇచ్చారు. వెంటనే అమలు చేయాలి.
- జి.పెద్దింట్లు, పోలవరం

ఉచిత ప్రయాణం ఎప్పటినుంచో..
జిల్లాలో 19 ఏళ్లు పైబడిన మహిళలు 8,29,659 మంది ఉండగా జిల్లాలో ఏలూరు, జంగారెడ్డిగూడెం, నూజివీడు ఆర్టీసీ డిపోల నుంచి రోజుకు 305 సర్వీసులు నడుపుతున్నారు. అలాగే జిల్లాలో 5,18,314 గ్యాస్ కనెక్షన్లు ఉండగా ఏడాదికి మూడు చొప్పున మొత్తంగా 17,43,942 సిలిండర్లను ఉచితంగా అందించాల్సి ఉంటుంది. ఆయా పథకాల అమలు కోసం జిల్లాలోని మహిళలు ఎదురుచూస్తున్నారు. అయితే ఇప్పటివరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నుంచి పూర్తిస్థాయిలో స్పష్టత రాకపోవడంతో వీరంతా నిరాశ చెందుతున్నారు. వీటితో పాటు సూపర్ సిక్స్‌లోని మిగిలిన పథకాలు వెంటనే అమలు చేయాలని జిల్లా మహిళలు కోరుతున్నారు.

మహిళలకు ప్రతి నెలా రూ.1,500



జిల్లాలో 18 ఏళ్లు నిండిన మహిళలు **6,71,033**
నెలకు అందించాల్సిన సాయం రూ.**100.65** కోట్లు
మూడు నెలల్లో నష్టపోయిన మొత్తం రూ.**301.95** కోట్లు

ఆడబిడ్డ నిధి మాటేంటి..



చంద్రబాబు నెలకు రూ.1,500 ఇస్తామంటే నమ్మాను. ఇప్పటివరకు ఎలాంటి సమాచారం లేదు. సచివాలయంలో అడిగితే ఇంకా ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్డరూ రాలేదంటున్నారు. కనీసం వచ్చే నెల నుంచైనా రూ.1,500 వస్తుందని ఎదురుచూస్తున్నా.
- బొందిలి పద్మ, గృహిణి, ఏలూరు

సూపర్ సిక్స్
- యువతకు 20 లక్షల ఉద్యోగాలు / నెలకు రూ.3 వేల నిరుద్యోగ భృతి
- స్కూలుకి వెళ్లే ప్రతి విద్యార్థికి ఏడాదికి రూ.15,000
- ప్రతి రైతుకు ఏటా రూ.20 వేలు ఆర్థిక సాయం
- ప్రతి మహిళకి నెలకు రూ.1500 (19 సం॥ నుంచి 59 సం ॥ వరకు)
- ప్రతి ఇంటికి ఏడాదికి ఉచితంగా 3 గ్యాస్ సిలిండర్లు
- మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం

అన్నదాత సుఖీభవ



జిల్లాలో అన్నదాత సుఖీభవ అర్హులైన రైతులు **1,98,179**
ఏడాదికి రూ.20 వేలచొప్పన అందించాల్సిన సాయం రూ.**396** కోట్లు

రైతులంటే అలుసా



కూటమి ప్రభుత్వం రైతులకిచ్చిన హామీలను అమలు చేయాలి. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇస్తామన్నారు. ఇప్పటివరకు చిల్లిగవ్వ ఇవ్వలేదు. అన్నదాతలంటే అలుసా. వర్షాలకు నారుమడులు, నాట్లు దెబ్బతిన్నాయి. రైతులపై అదనపు భారం పడింది.
- గొన్నూరి కృష్ణ, కొత్తగూడెం

నాడు తలుపు తట్టిన సంక్షేమం.. సాధికారత



గత ఐదేళ్ల వైఎస్ జగన్ ప్రభుత్వ పాలనలో సంక్షేమం పేదింటి తలుపు తట్టింది. కులమత వర్గాలు, రాజకీయాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సంక్షేమ లబ్ధిని చేకూర్చారు. సంక్షేమ క్యాలెండర్‌ను విడుదల చేసి పథకాలను అమలుచేశారు. అమ్మఒడి, రైతు భరోసా, వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపునేస్తం, ఈబీసీ నేస్తం తదితర సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో జిల్లాలోని పేదవర్గాలకు కోట్లాది రూపాయలు లబ్ధి చేకూర్చారు.

2023 ఏప్రిల్
- జగనన్న వసతి దీవెన 32,280 మంది విద్యార్థులకు రూ.30.95 కోట్లు
- ఈబీసీ నేస్తం 13,806 మందికి రూ.20.71 కోట్లు

మొత్తం లబ్ధి రూ.51.66 కోట్లు

2023 మే
- వైఎస్‌ఆర్ కళ్యాణమస్తు / షాదీతోఫా కింద 598 మందికి రూ.4.62 కోట్లు
- జగనన్న విద్యాదీవెన కింద 26,024 మందికి రూ.24.78 కోట్లు

మొత్తం లబ్ధి రూ.29.40 కోట్లు

2023 జూన్
- జగనన్న విద్యాకానుక 1,60,536 మంది విద్యార్థులకు.. అమ్మఒడి 1,72,956 మందికి రూ.259.43 కోట్లు
- రైతుభరోసా పథకం కింద 1,99,719 మందికి రూ.149.78 కోట్లు
- వైఎస్సార్ లా నేస్తం కింద 88 మందికి రూ.22 లక్షలు

మొత్తం లబ్ధి రూ.409.43 కోట్లు

2023 జూలై
- వైఎస్‌ఆర్ బీమా 3,101 మందికి రూ. 2.21 కోట్లు
- జగనన్న తోడు పథకం ద్వారా 21,048 మందికి రూ. 22.66 కోట్లు
- చేనేత నేస్తం కింద 162 మందికి రూ.38.88 లక్షలు
- సున్నావడ్డీ కింద 42404 గ్రూపులకు రూ.61.74 కోట్లు
- విదేశీ విద్య కింద 13 మందికి రూ.1.25 కోట్లు

మొత్తం లబ్ధి రూ.126.74 కోట్లు

2023 ఆగస్టు
- వాహనమిత్ర పథకం కింద 19,058 మందికి రూ.19.58 కోట్లు
- వైఎస్‌ఆర్ కాపునేస్తం కింద 19,869 మందికి రూ.29.80 కోట్లు
- జగనన్న చేదోడు కింద 17,935 మందికి రూ.17.93 కోట్లు

మొత్తం లబ్ధి రూ.67.31 కోట్లు

క్లుప్తంగా

శ్రీవారి హుండీ ఆదాయం రూ.2.05 కోట్లు



హుండీల నగదు లెక్కిస్తున్న ఆలయ సిబ్బంది

ద్వారకాతిరుమల: ప్రముఖ పుణ్యక్షేత్రమైన ద్వారకాతిరుమల చినవెంకన్న ఆలయ హుండీల నగదు లెక్కింపు స్థానిక ప్రమోద కల్యాణ మండపంలో బుధవారం అత్యంత కట్టుదిట్టమైన భద్రతల నడుమ జరిగింది. ఈ లెక్కింపులో శ్రీవారికి విశేష ఆదాయం సమకూరింది. గత 28 రోజులకు నగదు రూపేణా స్వామి వారికి రూ.2,05,16,675 ఆదాయంతో పాటు, కానుకల రూపేణా భక్తులు సమర్పించిన 197 గ్రాముల బంగారం, 4.406 కేజీల వెండి, అధికంగా విదేశీ కరెన్సీ లభించినట్టు ఆలయ ఈఓ వేంద్ర త్రినాథరావు తెలిపారు. లెక్కింపులోకి రాని పాత రూ.2000, రూ.1,000, రూ.500 నోట్లు ద్వారా రూ.13,500 లభించినట్టు చెప్పారు.

జిల్లాలో విద్యుత్ అధికారుల బదిలీ

ఏలూరు(ఆర్‌ఆర్‌పేట) : ఈపీడీసీఎల్ ఏలూరు ఆపరేషన్ సర్కిల్ పరిధిలోని వివిధ డివిజన్లకు చెందిన అధికారులను బదిలీ చేస్తూ ఆ సంస్థ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు జిల్లాలోని నిడదవోలులో పని చేస్తున్న బీ.గీతా భవాని, తాడువాయి ఏఈఈగా పని చేస్తున్న ఎస్.శ్రీనివాసులును రాజమహేంద్రవరం సర్కిల్‌కు బదిలీ చేశారు. గణపవరం ఏఈఈగా పనిచేస్తున్న కేఎస్ఎస్ ప్రసాద్, ఉండ్రాజవరం ఏఈఈగా పనిచేస్తున్న ఎస్.దొరబాబును కూడా రాజమహేంద్రవరం సర్కిల్‌కు బదిలీ చేశారు. రాజమండ్రి సర్కిల్ పరిధిలోని ముమ్మిడివరం ఏఈగా పని చేస్తున్న వీ.శివాజీని, ఐ.పోలవరం ఏఈగా పని చేస్తున్న జీ.సోమేశ్వరరావును ఏలూరు సర్కిల్‌కు బదిలీ చేశారు.

జిల్లా జూడో జట్ల ఎంపిక

ఏలూరు రూరల్: బుధవారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్ 14, 17 బాలబాలికల జిల్లా స్థాయి జూడో ఎంపిక పోటీలు నిర్వహించామని ఏలూరు జిల్లా స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి కె.అలివేలుమంగ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు త్వరలో జరగబోయే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు. అండర్ 14 బాలుర విభాగంలో ఏ చంద్రశేఖర్, డి.అజిత్‌కుమార్, జి.ఆదిత్యవర్ధన్, కె.కుశాల్, బి.చరణ్, సీహెచ్ పవన్‌కుమార్, ఎం.శివనాగు, బాలికల విభాగంలో టి.జోత్స్న, జె.హన్సిక, టి.హాసిని, ఎం.గోపిక, పి.హారిక, ఎస్.రుతమ్మ, యు.హేమశ్రీ ఎంపికయ్యారని వెల్లడించారు. అండర్ 17 బాలుర విభాగంలో కె.బాలశివకృష్ణ, సీహెచ్.అజయ్, పి.జగన్నాథ్, కె.హరిచరణ్‌చౌదరి, ఎస్కె అబ్దుల్ అజీజ్, కె.రాహుల్, బి.బాలకిరణ్, బి.నవీన్, సీహెచ్ రాజు, బాలికల విభాగంలో పి.దుర్గా లీలావతి, జి.సరిత, ఎం.అనూష, పి.శర్వాణి, డి.పావని తదితరులు ఉన్నారని పేర్కొన్నారు.

కొల్లేరు కాలుష్యంపై పరిశీలన

కై కలూరు: కొల్లేరుకు చేరే ముంపు నీటి కాలుష్యంపై చెన్నైకు చెందిన కేంద్రం బృందం, అటవీ శాఖ అధికారులు ఏలూరు జిల్లా మండవల్లి మండలం పెదఎడ్లగాడి వద్ద బుధవారం పరిశీలన చేశారు. నేషనల్ సెంటర్ ఫర్ సస్టైనబుల్ కోస్టల్ మేనేజ్‌మెంట్(ఎన్‌సీఎస్‌సీఎం) డాక్టర్ల బృంద సభ్యులు పూర్వజ రామచంద్రన్, దీపక్ సామ్యూల్, దీప్ ఆర్యన్ గంగూలీ, బొంతు సుబ్బారెడ్డితో పాటు అటవీ శాఖ అడిషనల్ పీసీసీఎఫ్ పీవీ చలపతిరావు ముంపు బారిన పడిన పెదఎడ్లగాడి వంతెన వద్ద నీటి శాంపిల్స్‌ను పరిశీలించారు.

ఆశ్రమం మాటున మానవ మృగాలు

- ఏలూరు బాలికల అత్యాచార కేసులో మలుపు
- ఆశ్రమం స్వామిజీ వ్యవహారంపైనా సందేహాలు
- ఆ స్వామికి టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు
- పోలీస్ విచారణలో వార్డెన్ ఫణిశ్రీ, శశికుమార్
- నిందితులను కఠినంగా శిక్షించాలి : కారుమూరి సునీల్, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఏలూరు టౌన్: ఏలూరు అమీనాపేటలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న బాలికల వసతి గృహంలో అఘాయిత్యాల కేసులో పోలీసులు విచారణ వేగవంతం చేశారు. ఈ కేసులో విస్తుగొలిపే అనేక విషయాలు బయటపడుతున్నాయి. బాలికల భవిష్యత్తును చిదిమేసిన నిందితుడు శశికుమార్‌తోపాటు సేవాశ్రమం స్వామిజీ పైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇక స్వామీజీకి టీడీపీలోని మంత్రులు, నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు తెలుస్తోంది. పూర్తిస్థాయిలో విచారణ చేస్తే అనేక దారుణాలు వెల్లడయ్యే అవకాశం ఉందని బాధితుల బంధువులు చెబుతున్నారు.



ఏలూరు అమీనాపేటలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం బాలికల వసతిగృహం

ఆశ్రమం స్వామీజీపైనా అనుమానాలు?

కేసులో ప్రధాన నిందితుడు శశికుమార్‌ను ఏలూరు పోలీసులు విచారిస్తున్నారు. ఈ నేపథ్యంలో బాలికలు, వారి తల్లిదండ్రులు చెబుతున్న విషయాల ఆధారంగా విచారణలో వేగం పెంచారు. హాస్టల్ నుంచి బాపట్లలో స్వామీజీ వద్దకు పలువురు బాలికలను తీసుకెళ్లినట్లు చెబుతున్నారు. మూడు రోజుల క్రితం ఒక బాలికను తీసుకువెళ్లిన శశికుమార్ స్వామీజీకి చూపించాడని, బాలికను చూసిన స్వామీజీ బాగుందని, ఉపయోగపడుతుందని చెప్పినట్లు బాలిక తన స్నేహితుల వద్ద వాపోయింది. తనకు ఏమీ అర్థం కాలేదని, రూమ్‌కు తీసుకువెళ్లి అక్కడ తాళ్లతో కట్టేసి బలత్కారం చేసినట్లు కొందరు బాలికలు అంటున్నారు. ఇదే తరహాలో చాలా మంది బాలికలను స్వామీజీ వద్దకు ప్రధాన నిందితుడు శశికుమార్ తీసుకెళ్లేవాడని చెబుతున్నారు.



టీడీపీ నేతలతో స్వామి దయానంద సరస్వతి (ఫైల్)

పోలీసుల విచారణలో నిందితులు

ఏలూరు అమీనాపేట ఆశ్రమం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బాలికల హాస్టల్ విద్యార్థినుల జీవితాలతో ఆడుకున్న మృగం బీ.శశికుమార్, వార్డెన్ ఫణిశ్రీ పోలీసుల అదుపులో ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ పర్యవేక్షణలో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రత్యేక పోలీస్ బృందాలు విచారణ చేస్తున్నట్లు చెబుతున్నారు. బుధవారం తెల్లవారుజామున ఇద్దరు ప్రధాన నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఇక కేర్‌టేకర్‌గా హాస్టల్‌లో ఉంటున్న లావణ్యను సైతం పోలీసులు విచారిస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే ముగ్గురు బాలికలు ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

స్వామీజీకి టీడీపీ నేతలతో సంబంధాలు

ఏలూరు అమీనాపేటలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవాశ్రమం నిర్వాహకుడు స్వామీజీకి టీడీపీ నేతలతో సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు చెబుతున్నారు. ఏలేశ్వరంలో శ్రీ దయానంద సర్వస్వతీ సేవాశ్రమం ప్రారంభోత్సవంలో రాష్ట్ర మంత్రి హాజరైనట్లు తెలుస్తోంది. దయానంద సరస్వతి స్వామి టీడీపీ నేతలతో సన్నిహితంగా ఉంటారని అంటున్నారు. నిందితుడు శశికుమార్ దయానంద సర్వస్వతి స్వామి వద్దకు బాలికలను తరచు తీసుకెళ్తూ ఉంటాడని బాధిత బాలికలే చెప్పడం గమనార్హం.



ఏలేశ్వరంలో స్వామి దయానంద సరస్వతి ఆశ్రమం ప్రారంభోత్సవంలో టీడీపీ మంత్రి, నేతలు(ఫైల్)


హాస్టల్ నుంచి వెళ్లిపోయిన బాలికలు

హాస్టల్‌లో వసతి పొందుతున్న బాలికలు భయంతో వణికిపోయారు. హాస్టల్ నుంచి బాలికలు తమ గ్రామాలకు వెళ్లిపోయారు. నిందితుడు శశికుమార్ అనాథ బాలికలనే టార్గెట్ చేసుకునేవాడని సమాచారం. తల్లిదండ్రులు లేని బాలికలను లక్ష్యంగా చేసుకుని వారికి భయపెట్టి అఘాయిత్యాలకు పాల్పడుతుంటాడని చెబుతున్నారు. ఏలూరుతో పాటు ఇతర ప్రాంతాలకు సైతం బాలికలను తీసుకెళ్లేవాడని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

> **కఠినంగా శిక్షించాలి**
>
> 
>
> అమీనాపేట ఆశ్రమం బాలికల హాస్టల్‌లో జరిగిన అత్యంత హేయమైన సంఘటనపై పోలీస్ అధికారులు నిష్పక్షపాతంగా విచారణ చేసి నిందితుడు శశికుమార్, సహకరించిన వార్డెన్ ఫణిశ్రీని కఠినంగా శిక్షించాలి. బాలికలకు రక్షణ కల్పించలేకపోవడం సిగ్గుచేటు. ఇలాంటి వ్యక్తిత్వం ఉన్న వారిని బాహ్య ప్రపంచంలో తిరగనివ్వకూడదు.
>
> కారుమూరి సునీల్‌కుమార్, వైఎస్సార్‌సీపీ ఏలూరు పార్లమెంట్ ఇన్‌ఛార్జ్

> **బాధితులకు అండగా ఉండాలి**
>
> 
>
> పేదవర్గాలకు చెందిన బాలికలు చదువుకునేందుకు వస్తే నీచమైన రీతిలో మానవమృగంలా మారిన శశికుమార్ వారి జీవితాలను నాశనం చేయటం దారుణం. అతనికి సహకరించిన వ్యక్తులను వదిలిపెట్టకుండా కఠినంగా శిక్షించేలా పోలీసు అధికారులు కేసులు పెట్టాలి. బాధితులకు న్యాయం చేయాలి.
>
> వైఎస్‌పీ శివరావు, జేసీఎస్ కన్వీనర్, ఏలూరు

కొల్లేరులో బతుకు పోరు



ఇటీవల కురుస్తున్న వర్షాలకు.. ఇటు తమ్మిలేరు... అటు బుడమేరు నీరు కొల్లేరుకు చేరింది. కొల్లేరు మొత్తం కళకళలాడుతుంది. మత్స్యకారులు చేపల వేటలో బిజీగా మారారు. తాటి దోనె, ఫైబర్ బోట్లతో చేపల వేటలో బిజీ అయ్యారు. కైకలూరు వెళ్లే ప్రాంతంలో నీటితో కళకళలాడుతున్న కొల్లేరు చిత్రం ఇది.

– ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్/ఏలూరు

అవసరం తీరాక.. జంప్

- వైఎస్సార్‌సీపీకి జెడ్పీ చైర్‌పర్సన్ పద్మశ్రీ వెన్నుపోటు
- సర్పంచ్‌గా ఓడిన కుటుంబం నుంచి జెడ్పీటీసీగా అవకాశం
- గతేడాది జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవ ఎన్నిక
- ఇప్పుడు అధికారం కోసం అడ్డదారులు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీకి వైఎస్సార్‌సీపీలో ఎంతో ప్రాధాన్యం ఇచ్చారు. సాధారణ గృహిణిగా ఉన్న ఆమెకు జెడ్పీటీసీగా అవకాశం కల్పించారు. కొంత కాలానికి జెడ్పీ చైర్‌పర్సన్‌గా ఏకగ్రీవంగా ఎన్నిక చేశారు. 2014 స్థానిక సంస్థల ఎన్నికల్లో సర్పంచ్‌గా ఓడిపోయిన కుటుంబం నుంచి వచ్చిన మహిళకు జెడ్పీటీసీగా, జెడ్పీ చైర్మన్‌గా అనేక అవకాశాలు ఇచ్చి అందలం ఎక్కిస్తే వెన్నుపోటు పొడిచారు. రాజకీయంగా ఉనికితో పాటు ప్రాధాన్యత ఇచ్చిన పార్టీని మోసగించడం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

పద్మశ్రీ, భర్త ప్రసాద్‌కు పార్టీలో ప్రాధాన్యం

పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త ఘంటా ప్రసాద్ బుధవారం నారా లోకేష్ సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. వైఎస్సార్‌సీపీలో మొదటి నుంచి ఘంటా ప్రసాద్ కీలకంగా ఉన్నారు. పార్టీ కూడా అదే స్థాయిలో ప్రాధాన్యతనిచ్చి జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడిగా చేశారు. 2021లో దెందులూరు నియోజకవర్గం పెదపాడు జెడ్పీటీసీగా ఘంటా ప్రసాద్ భార్యకు అవకాశం కల్పించారు. అనంతరం జెడ్పీ చైర్మన్‌గా ఉన్న కవురు శ్రీనివాస్ ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో జెడ్పీ చైర్మన్ పదవీ ఖాళీ అయింది. అనేక మంది పదవి కోసం ప్రయత్నాలు చేసినా.. బీసీ సామాజిక వర్గానికి చెందిన మహిళకు పదవి ఇవ్వాలనే కారణంతో పద్మశ్రీకి గతేడాది జెడ్పీ చైర్‌పర్సన్‌గా అవకాశం ఇచ్చారు.



టీడీపీలో చేరిన జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ, ఆమె భర్త ఘంటా ప్రసాద్

మొదట జనసేన.. ఇప్పుడు టీడీపీ

2026 ఏప్రిల్ వరకు ఆమెకు పదవీ కాలం ఉంది. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఓటమి పాలు కావడంతో పదవి కాపాడుకోవడానికి కూటమి వైపు చూశారు. తొలుత జనసేన అని ప్రకటించి చివరికి టీడీపీలో చేరారు. 2013 ఎన్నికల్లో ఘంటా ప్రసాద్ తండ్రి ఘంటా రంగారావు పెదపాడు మండలం సత్యవోలు నుంచి సర్పంచ్‌గా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అలాంటి రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబం నుంచి వచ్చిన మహిళకు జెడ్పీ చైర్‌పర్సన్‌గా ప్రాధాన్యం ఇచ్చినా వంచనకు పాల్పడి పార్టీకి ద్రోహం చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అది కూడా జెడ్పీటీసీల నుంచే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుంది. తనతో పాటు 15 మంది జెడ్పీటీసీలను తీసుకువెళ్లడానికి అన్ని రకాలుగా ప్రయత్నించినా, జెడ్పీటీసీలు ససేమిరా అనడంతో ఒంటరిగా టీడీపీలో చేరారు.

ఘంటా రాకను వ్యతిరేకిస్తున్న ఎమ్మెల్యేలు

ఘంటా ప్రసాద్ ఈ నెల 2న పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అదే రోజు సాయంత్రం జనసేనలో చేరుతున్నట్లు ప్రకటించి అన్ని ఏర్పాట్లు చేసుకున్నారు. మళ్లీ మూడురోజులు తరువాత టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్‌ను విశాఖలో కలిసి ఆగమేఘాల మీద ఘంటా ప్రసాద్ టీడీపీ కండువా వేయించుకున్నారు. మళ్లీ బుధవారం అమరావతిలో లోకేష్‌ను కలిసి జెడ్పీ చైర్‌పర్సన్, ఆమె భర్త టీడీపీలో చేరారు. కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఏలూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు మినహా ఏలూరు జిల్లా టీడీపీ ఎమ్మెల్యేలు ఎవరూ పాల్గొనలేదు. దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ జెడ్పీ చైర్‌పర్సన్ చేరికను బలంగా వ్యతిరేకించారు.

ఏలూరు జిల్లాలో మెక్సికో ప్రతినిధుల పర్యటన

ఏలూరు(మెట్రో) : ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం కార్యక్రమాన్ని ప్రపంచ వ్యాప్తంగా విస్తరించేందుకు రైతు సాధికార సంస్థతో కలిసి పని చేయాలని ఆశిస్తున్నట్లు అంతర్జాతీయ దాతృత్వ సంస్థ నౌ పార్టనర్స్ ప్రతినిధి లియోనార్డో సిల్వా డి ఆండ్రేడ్ అన్నారు. రైతు సాధికార సంస్థ రైతుల సంక్షేమమే కాకుండా గాలి, నీరు, భూమి, ఆరోగ్యం, తదితర అనేక అంశాలను దృషిలో ఉంచుకుని కార్యక్రమం అమలు చేస్తుందన్నారు. రాష్ట్రంలో రైతు సాధికార సంస్థ 'ఏపీసీఎన్ఎఫ్'(ఆంధ్ర ప్రదేశ్ ప్రజా భాగస్వామ్య ప్రకృతి వ్యవసాయం) ద్వారా అమలు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను పరిశీలించేందుకు వచ్చిన మెక్సికో దేశ ప్రతినిధి బృందం పర్యటనలో భాగంగా ఈ నెల 18 నుంచి 3 రోజుల పాటు ఏలూరు జిల్లాలో పర్యటిస్తోంది. మెక్సికో ప్రభుత్వ ఏరియా డైరెక్టర్ డియాజ్ మరియా నేతృత్వంలో పర్యటిస్తున్న ఈ బృందంలో వ్యవసాయ పరిశోధకులు, సాంకేతిక నిపుణులు, రైతులు కూడా ఉన్నారు. ఈ బృందం మొదటి రోజు ఏలూరు జిల్లా పెదవేగి మండలం వంగూరు గ్రామంలో పర్యటించింది. ముందుగా ఎస్.రామచంద్రుడు వ్యవసాయ క్షేత్రంలో పర్యటించారు. రైతు జీవామృతం తయారీ కోసం క్షేత్రంలో ఏర్పాటు చేసిన శాశ్వత ద్రవ జీవామృతం పిట్‌ను పరిశీలించారు. కే.ఎస్.రాయ్ వ్యవసాయ క్షేత్రాలలో కూడా ప్రకృతి వ్యవసాయ విధానంలో పండించిన వివిధ రకాల పంటలను పరిశీలించారు. జిల్లా వ్యవసాయ అధికారి షేక్ హబీబ్ బాషా, రైతు సాధికార సంస్థ ప్రాంతీయ ప్రోగ్రామ్ కోఆర్డినేటర్ అరుణ, అంతర్జాతీయ ఆపరేషన్స్ డైరెక్టర్ స్మితా జాకోబ్, థిమాటిక్ లీడ్ సురేష్, మధు ప్రీతి, పావని మెక్సికో బృందం వెంట ఉన్నారు.



జీవామృతం కోసం ఏర్పాటు చేసిన శాశ్వత ద్రవ జీవామృతం పిట్ పరిశీలిస్తున్న మెక్సికో బృందం

కారు డ్రైవర్‌కు జైలుశిక్ష

నూజివీడు: కారును నిర్లక్ష్యంగా నడిపి వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు మూడు నెలల జైలుశిక్ష, రూ.1500 జరిమానా విధిస్తూ నూజివీడు స్పెషల్ మెజిస్ట్రేట్ వేల్పుల కృష్ణమూర్తి బుధవారం తీర్పు వెలువరించారు. 2021 మే 1న ఉదయం 9 గంటల సమయంలో నూజివీడు మండలం పోతురెడ్డిపల్లికి చెందిన అక్కినేని బెనర్జీ కారును అతివేగంగా నడుపుతూ నూజివీడుకు వస్తున్నాడు. అదే సమయంలో కారుకు ఎదురుగా వస్తున్న బైక్‌ను బలంగా ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న బెక్కం నరేష్ తీవ్రంగా గాయపడగా ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు.

అఘాయిత్యాలపై కఠిన చర్యలు

- డీజీపీ ద్వారకా తిరుమలరావు
- ఏలూరు రేంజ్ ఎస్పీలతో క్రైమ్ రివ్యూ

ఏలూరు టౌన్ : రాష్ట్రంలో చిన్నారులు, బాలికలు, మహిళలపై లైంగికదాడులు, అఘాయిత్యాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎవరినీ ఉపేక్షించేదిలేదని డీజీపీ సీహెచ్ ద్వారకాతిరుమలరావు హెచ్చరించారు. ఏలూరు రేంజ్ ఐజీ కార్యాలయంలో ఆయన బుధవారం క్రైమ్ రివ్యూ నిర్వహించారు. తొలుత ఆయనకు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. జిల్లా పోలీస్ సిబ్బంది ఆయనకు గౌరవ వందనం చేశారు. అనంతరం ఆయన ఎస్పీలతో నేర సమీక్ష చేశారు. సుమారు రెండు గంటల పాటు ఏలూరు రేంజ్ పరిధిలో నేరాల పరిస్థితి, కేసుల నమోదు, దర్యాప్తు, నిందితుల అరెస్టులు, కోర్టులో చార్జిషీట్ దాఖలు వంటి అంశాలతో పాటు నేర పరిశోధనపైనా డీజీపీ ఆరా తీశారు. ప్రతి అంశంపైనా క్షుణ్ణంగా అడిగి తెలుసుకున్నారు. ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్, పశ్చిమగోదావరి జిల్లా ఎస్పీ అద్నాన్ నయీం అస్మి, తూర్పుగోదావరి జిల్లా ఎస్పీ నరసింహారావు, కృష్ణా జిల్లా ఎస్పీ ఆర్.గంగాధరరావు, కాకినాడ జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్, బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎస్పీ బొడ్డేపల్లి కృష్ణారావు నేర సమీక్షకు హాజరయ్యారు.



ఏలూరు రేంజ్ ఎస్పీలతో నేర సమీక్ష నిర్వహిస్తున్న డీజీపీ ద్వారకాతిరుమలరావు

పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు

డీజీపీ ఏలూరు పర్యటన నేపథ్యంలో డీఎస్పీ డీ.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు. ఐజీ కార్యాలయం వద్ద పోలీస్ అధికారులు మోహరించారు. సీఐలు జీ.సత్యనారాయణ, వైవీ రమణ, కోటేశ్వరరావుతో పాటు మహిళా స్టేషన్ సీఐ ఎం.సుబ్బారావు, భీమడోలు సీఐ యూజే విల్సన్, సుభాష్, ఎస్‌బీ సీఐ మల్లేశ్వరరావు, ఆదిప్రసాద్, ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావుతోపాటు జిల్లాలోని పోలీస్ అధికారులు డీజీపీ కార్యక్రమంలో ఉన్నారు. ఈ సందర్భంగా నూజివీడు పరిధిలో అఘాయిత్యానికి గురైన బాలిక తల్లిదండ్రులకు డీజీపీ చేతుల మీదుగా రూ.లక్ష చెక్కును అందజేశారు.

పదోన్నతులు కల్పించండి: 95 బ్యాచ్ సీఐలు

ఏలూరు పర్యటనలో డీజీపీ ద్వారకాతిరుమలరావును 1995 బ్యాచ్ సీఐలు కలిసి వినతిపత్రం సమర్పించారు. ఏలూరు సీసీఎస్ సీఐ సీహెచ్ మురళీకృష్ణ ఆధ్వర్యంలో పలువురు సీఐలు డీజీపీకి తమ సమస్య చెప్పుకున్నారు. 1995 బ్యాచ్‌కు చెందిన తమకు పదోన్నతుల్లో తీవ్ర జాప్యం జరిగిందని తెలిపారు. తమకంటే జూనియర్లుగా ఉన్న కర్నూలు, కడప రేంజ్‌లోని సీఐలకు పదోన్నతులు లభించాయని తెలిపారు. తమకు ప్రస్తుతం డీఎస్పీ ప్యానెల్‌లో అవకాశం లేదని 1991 బ్యాచ్‌కు అమలు చేసిన సూపర్ న్యూమరరీ విధానంలో పదోన్నతులు కల్పించాలని వినతి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన డీజీపీ సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

సమస్యలపై వినతిపత్రం

ఏలూరు జిల్లా, రాష్ట్ర పోలీస్ అధికారుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ అధికారుల సంఘం ప్రతినిధులు డీజీపీ ద్వారకాతిరుమల రావుకు వినతి చేశారు. బుధవారం డీజీపీని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాలోని పోలీస్ అధికారులు, సిబ్బంది సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా అధ్యక్షుడు ఆర్.నాగేశ్వరరావు కోరారు.

ఈనెల 21న క్రికెట్ జట్టు ఎంపిక

ఏలూరు రూరల్: ఈ నెల 21వ తేదీన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అండర్ 14 బాలురు క్రికెట్ జట్టు ఎంపిక పోటీలు చేపట్టనున్నామని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు జి.ఆదిత్య వర్మ, కార్యదర్శి వీవీఎస్ఎం శ్రీనివాసరాజు ఒక ప్రకటనలో తెలిపారు. ఏలూరు ఆశ్రం మెడికల్ కళాశాల క్రీడా మైదానంలో ఉదయం 9 గంటలకు పోటీలు చేపడతామని వెల్లడించారు. పోటీల్లో పాల్గొనే బాలురు 01-09-2010 తర్వాత పుట్టినవారై ఉండాలన్నారు. జిల్లా జట్టుకు ఎంపికైన వారు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరగబోయే ఇంటర్ డిస్ట్రిక్ట్ పోటీల్లో పాల్గొంటారని వివరించారు.

రేపు జాబ్‌మేళా

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, సీడాప్, జిల్లా ఉపాధి కార్యాలయం సంయుక్త అధ్వర్యంలో జిల్లాలోని తడికలపూడి మహిళా ప్రాంగణం (స్కిల్ హబ్)లో ఈ నెల 20న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గంటా సుధాకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో ఎస్ఎస్ ఎస్వీ (అరబిందో ఫార్మా), లగ్జరీ లాండ్ లోడ్ యూనివర్సల్ ప్రాజెక్టు, బజాజ్ క్యాపిటల్, అమెజాన్, జీనియస్ కన్సల్టెంట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. సుమారు 280 మందికి ఉద్యోగ అవకాశాలు ఏర్పాటు చేశామన్నారు. ఈ జాబ్‌మేళాకు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిగ్రీ, పీజీ వంటి విద్యార్హతలు ఉండి 18–30 సంవత్సరాల వయసు గల వారు అర్హులని తెలిపారు.

భూసేకరణ రైతులతో సమావేశం

పోలవరం రూరల్: జీలుగుమిల్లి నుంచి పట్టిసీమ వరకు నిర్మించే జాతీయ రహదారి ఎన్‌హెచ్ 365 రోడ్డు నిర్మాణానికి భూసేకరణకు సంబంధించిన రైతులతో జాయింట్ కలెక్టర్ పి.ధాత్రీరెడ్డి బుధవారం సమావేశం నిర్వహించారు. పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని ఎల్ఎన్‌డీపేట గ్రామానికి చెందిన రైతులతో ఈ సమావేశం నిర్వహించారు. రైతులకు సంబంధించిన భూములు, వాటిలోని కట్టడాలు, చెట్లు ఏమేం ఉన్నాయి వంటి వివరాలతో పాటు రైతుల వివరాలను తెలుసుకున్నారు. జేసీ మాట్లాడుతూ ఎన్‌హెచ్ 365 నిర్మాణానికి సంబంధించి రెండు విడతలుగా విభజించామన్నారు. మొదటి విడత ఏడు గ్రామాలు, రెండో విడత ఐదు గ్రామాల్లో భూసేకరణకు సంబంధించి సమావేశాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో తహసిల్దార్ వీఎస్ఆర్ఎల్‌రాజు, జాతీయ రహదారి నిర్మాణ అధికారులు పాల్గొన్నారు.

లైంగికదాడి కీచకులను కఠినంగా శిక్షించాలి

ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డీఎన్నార్ డిమాండ్

కైకలూరు: సేవాశ్రమంలో బాలికలపై లైంగికదాడికి పాల్పడిన కీచకులను కఠినంగా శిక్షించాలని ఏలూరు జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) డిమాండ్ చేశారు. కైకలూరు వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏలూరు ఘటనపై బుధవారం ఆయన మాట్లాడారు. అమీనాపేటలో శ్రీ స్వామి దయానంద సరస్వతీ సేవాశ్రమంలో వార్డెన్ మణిశ్రీ భర్త శశికుమార్ ఫొటోషూట్‌ల పేరుతో బాలికలను బయటకు తీసుకెళ్ళి లైంగికదాడులకు పాల్పడటం అత్యంత దారుణమైన విషయమన్నారు. సేవాశ్రమంలో పేద, బడుగు, బలహీనవర్గాలకు చెందిన బాలికలు చదువుతున్నారన్నారు. లైంగికదాడికి పాల్పడటమే కాకుండా బాలికలందరిపై దాడి చేయడం అత్యంత హేయమన్నారు. ఈ ఘటన వెనుక వార్డెన్ మణిశ్రీ ఆమె భర్త శశికుమార్‌తో పాటు మరొకందరు ఉండవచ్చనే అనుమానం ఉందన్నారు. ఇతర ప్రభుత్వ హాస్టల్స్ నుంచి కూడా బాలికలను సేవాశ్రమంలో చేరాలని శశికుమార్ ఒత్తిడి తెచ్చేవాడని తెలిసిందన్నారు. ఈ కేసును పూర్తి స్థాయిలో విచారణ చేసి నిజాలు నిగ్గుతేల్చాలన్నారు. ఈ విషయమై గురువారం ఏలూరు జిల్లా ఎస్పీ, కలెక్టర్‌కు పార్టీ తరపున వినతిపత్రాన్ని అందిస్తామన్నారు.



పత్రిక క్లిప్పింగులు చూపిస్తున్న జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు డీఎన్నార్

పోక్సో కేసు నమోదు చేయాలి

ఏలూరు (టూటౌన్): స్థానిక అమీనాపేటలోని శ్రీ స్వామి దయానంద సరస్వతి సేవా శ్రమం బాలికల వసతి గృహంలో బాలికలపై లైంగిక దాడికి పాల్పడిన శశికుమార్‌పై పోక్సో కేసు పెట్టాలని అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం(ఐద్వా), భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) జిల్లా కమిటీలు డిమాండ్ చేశాయి. ఈ మేరకు ఐద్వా, ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో కలెక్టర్‌కు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంస్థల ప్రతినిదులు ఎ.శ్యామలరాణి, జి.శారద, కె.లెనిన్‌లు మాట్లాడుతూ అమీనాపేటలో గత కొద్ది సంవత్సరాలుగా ప్రైవేటు వసతి గృహం నిర్వహిస్తున్నారని.. ఈ వసతి గృహం వార్డెన్ భర్త శశికుమార్ బాలికలపై లైంగిక దాడులకు పాల్పడుతున్నాడని ఈ విషయంపై నిన్ననే పోలీసులకు బాలికల తల్లిదండ్రులు, బంధువులు ఫిర్యాదు చేశారన్నారు. పరారీలో ఉన్న శశికుమార్‌ను వార్డెన్ ఫణిశ్రీ, కేర్ టేకర్ బి.లావణ్యను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.